**కథ**

**డివిజనల్ రైల్వే మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీహరిరావుకి సడన్‌గా మాసివ్ హార్టెటాక్ రావడంతో అర్ధరాత్రి నిద్రలోనే శరీరానికి సెండాఫ్ చెప్పేశాడు.**

అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు కొడుకులు రమేష్, సురేష్ తండ్రి మరణ వార్త తెలియగానే ఆఘమేఘాల మీద ఫామిలీలతో వచ్చివాలారు.

తండ్రికి చెయ్యాల్సిన కర్మకాండలు బంధువర్గమంతా ఆశ్చర్యపోయేంత ఘనంగా చేశారు.

లక్ష్మి శ్రీహరిరావు భార్య. భర్త పోయిన షాక్ నుండి కోలుకోలేకపోతోంది. అన్యోన్యంగా, తోడుగా ముప్ఫయ్యేళ్ళు కలిసి జీవించిన ఇద్దరిలో... తనని ఒంటరిని చేసి హఠాత్తుగా వెళ్ళిపోయిన భర్తని మరువలేక, ఎవ్వరికి మొహం చూపలేకపోతోంది. మరోవారం రోజుల్లో కొడుకులూ, కోడళ్ళూ వెళ్ళిపోతారు. ఆ తర్వాత ఏం చెయ్యాలి?

''లక్ష్మీ! నేను పోయి నువ్వు ఒంటరివైతే మనం కట్టుకున్న ఇంటిని వదిలి, కొడుకుల వెంట ఎక్కడికీ వెళ్ళకు. ఒంటరిగా ఉండటానికి అవసరమైన మనోధైర్యాన్ని ఇప్పట్నుంచే అలవర్చుకో. ఒకవేళ నువ్వు ముందు పోయి, నేను మిగిలిపోతే నా ఏ కొడుకునీ ఆశ్రయించను. మనం కలిసి పంచుకున్న అనుభవాలకీ, తెంచుకోలేని జ్ఞాపకాలకీ ఆలంబన అయిన ఈ ఇల్లే, మనకి అండగా నిలుస్తుంది. మన జ్ఞాపకాలే మనతో ఉంటూ, జీవితాన్ని చివరికి చేరుస్తాయి'' ఇద్దరి మధ్యా రాసుకోని ఒప్పందం అది. అందుకే లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉండటానికే నిర్ణయించుకుంది.

★ ★ ★

అన్నదమ్ములిద్దరూ భార్యలతో కలిసి మేడమీద హాల్లో సమావేశమయ్యారు.

రమేష్ టి.వి.లో క్రికెట్ చూస్తుంటే.. భార్య రిమోట్‌తో టి.వి. ఆఫ్ చేసి-

''ముఖ్యమైన పనులు ముందుంచుకుని, ఈ గొడవ ఇప్పుడు ముఖ్యమా!'' అంది అసహనంగా.

''ఏమిటొ దినా!''

''ఏమిటంటావేంటయ్యా! కర్మకాండలయిపోయాయి. మరి తర్వాత కార్యక్రమాల సంగతేం ఆలోచిస్తున్నారు''

''ఇంకేముంది... ఫ్లైట్ టిక్కెట్స్ కన్ఫర్మ్ అయ్యాయి. వచ్చే వారం ప్రయాణం'' అని రమేష్ అంటే..

''అక్కయ్య ఉద్దేశం అది కాదు బావగారూ! మనం ఇపుడు అమెరికా వెళ్ళామంటే, మళ్ళీ ఇండియా రావటానికి మూడేళ్ళు పడుతుంది కదా! అందుకే, ఆస్తిపాస్తుల సంగతేం చేద్దామని అడుగుతోంది. అంతేకదూ సుమిత్రా!'' అంది తెలివిగా సురేష్ భార్య గీత.

# మీ బాటలోనే...

''అమ్మతో ఈ విషయం ఇప్పుడే ఎలా చెబుతాం?'' అన్నాడు సురేష్.

''కష్టమే మరి. ఇప్పుడు తేల్చుకోకపోతే, మూడేళ్ళ వరకూ వాయిదా వేయలేం గదా!'' అంది సుమిత్ర.

''ఈ ఇంట్లో మీ అమ్మ ఉంటుంది. ఆమె తదనంతరమే ఇది మనకి వచ్చేది. బాంకు డిపాజిట్లు, షేర్లు అన్నీ ఆవిడ పేరుతోనే ఉన్నాయి. పోతే నగలు..'' గీత మాట్లాడుతుంటే-

''తెలియకుండా మాట్లాడకు. నగలన్నీ అత్తయ్య కస్టడీలోనే ఉన్నాయి. వజ్రాల కమ్మలు, ముక్కుపుడక, డైమండ్ నెక్లెస్ ఇంకా ఆవిడ వంటిని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఇపుడు ఆవిడ ఉపయోగించనిదల్లా..మాదాపూర్ దగ్గరున్న ఐదెకరాల స్థలం, బంజారాహిల్స్‌లో ఉన్న ఇల్లూ..'' బయటపెట్టింది సుమిత్ర.

''ప్రస్తుతానికి ఈ రెండూ మనకొస్తే చాల్లే. మిగిలినవి ఎలాగూ ఆమె తర్వాత మనకే వస్తాయిగా!'' ధీమాగా అంది గీత.

''ఇంతగా ఆరాటపడుతున్నారు గదా! మీరిద్దరూ అమ్మ దగ్గరకెళ్ళి అడిగిరండి'' అని రమేషంటే..

''తల్లీ కొడుకుల మధ్య మేం తల దూర్చటం తప్పవుతుందండీ!'' అంది గీత సురేష్ వైపు చూస్తూ.

''సురేష్! నువ్వెళ్ళి అమ్మతో మాట్లాడు. నువ్వయితే మృదువుగా..''

''ఊ..హూ. అదెలా మర్యాదవుతుందిరా! ఇంటికి పెద్దవాడివి నువ్వుండగా, నేను పెద్దరికం చెయ్యటం బాగుండదు'' అన్నాడు సురేష్ అన్న మాటకి అడ్డొస్తూ.

పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలన్న సమస్య నలుగురినీ నిలకడగా కూచోనివ్వడం లేదు.

ఇంతలో ''రమేష్! సురేష్! ఓసారి కిందికి రండి'' తల్లి నుండి పిలుపు.

''అబ్బ.. ప్రాబ్లం సాల్వయింది. మీ అమ్మే పిలిచింది. తొందరగా వెళ్ళి స్థలం గురించి, ఇల్లు గురించి మాట్లాడి రండి'' భర్తల్ని యుద్ధానికి పంపుతున్న వీర వనితల్లా వేగంగా కిందికి పంపారు భార్యలిద్దరూ.

గదిలో కూచుని భర్త బట్టల్ని రెండు సూట్కేసుల్లో సర్దుతున్న తల్లిని చూసి ''అమ్మా! పిలిచావా?'' అన్నారిద్దరు కొడుకులూ.

''రండి! ఇలా వచ్చి కూచోండి...ఇవన్నీ మీ నాన్నగారి బట్టలు. ఖరీదైన ప్యాంట్లూ, షర్టులూ, కోటు, టై, స్వెట్టర్లూ, ఓవర్ కోట్లూ.. ఇంకా చాలా ఉన్నాయి. ఆయన రిటైర్ కాకముందే అర్ధంతరంగా ఇలా మనల్నొదిలి వెళ్ళిపోవటం..అసలు ఆయన హుందా అంతా బట్టల్లోనే చూపించేవారు. చిన్నప్పుడు మీరిద్దరూ మీ నాన్న బట్టల్ని చూసి మోజుపడేవాళ్ళు. సురేషైతే ఆయన లేకుండా చూసి, ఆయన బట్టల్ని వేసుకునే వాడు. ఆ సంగతి ఆయనకి తెలిసి మీ ఇద్దర్నీ కోప్పడేవారు. అదంతా అప్పుడు. ఇహ! ఇప్పుడు ఇవన్నీ మీరే వేసుకోవాలి. మీరివి అప్పుడప్పుడు వేసుకుంటుంటే మీ నాన్న మీతోనే ఉన్న తృప్తి మీకుంటుంది. మీ ఇద్దరిలో ఆయన్ని చూసుకున్న సంతృప్తి నాకు కలుగుతుంది. చెరొకటీ తీసుకెళ్ళండి'' అంది లక్ష్మి.

సూట్కేసులతో పైకొచ్చిన బట్టల్ని, భర్తల్ని చూసి-

''పాత్రలమ్ముకునే వాళ్ళకోసే బట్టల్ని భద్రంగా ఇద్దరూ కలిసి పైకి మోసుకొచ్చారు'' అని సుమిత్ర అంటే,

''సెంటిమెంటల్‌గా ఆవిడ మీకంటగట్టడం, సిగ్గు లేకుండా మీరివి తెచ్చుకోవడం..'' అని గీత అంది.

''మీరిద్దరూ ఇలా లబలబా మాట్లాడటం వలన ప్రయోజనం లేదు. మనం నిదానంగా ఆలోచించి, ఈ పాతబట్టల్ని డిస్పోజ్ చెయ్యాలి, అదే సమయంలో అమ్మ మనసు బాధపడకుండా చూడాలి'' అని సురేషంటే..

''ఆస్తి దక్కించుకోవాలంటే అవస్థలు తప్పవు'' అన్నాడు రమేష్.

నలుగురూ ఆలోచనలో పడ్డారు.

సడన్‌గా సుమిత్ర- ''అద్భుతమైన అయిడియా వచ్చింది. ఆలస్యం చెయ్యకుండా అమలు చెయ్యండి. కచ్చితంగా అత్తయ్య సంతోషిస్తారు. ఆ తర్వాత చూడండి. మీ అమ్మగారే పిలిచి స్థలం,



ఇంటి
సంగతి ప్రస్తావించకపోతే'' అంది.

ఆ మాట విని గీత మనసు సంతోష ండవం చేసింది.

★ ★ ★

''అమ్మా! మేం చేసిన పని విన్నావం ే ఎంత సంతోషిస్తావో తెలుసా!'' అన్నారిద్దరూ ఁ ిసారి.

''ఏంట్రా! మీ నాన్న డ్రెస్ వేసుకొవ ా! దగ్గరకి రండి చూస్తాను''

''అది కాదమ్మా! ్నగారు ఎంతోమందికి చదువు చెప్పించారు. ంతోమందిని ఉద్యోగంలో పెట్టించారు. ఎంతో ందికి గుప్తదానాలు చేశారు'' అని రమేష్ చెబు ే..

''అదేరా! మన గొప్పతనం. అడిగించుకుని ఇస్తే అది ు, అడగకుండా చేస్తే ధర్మం అనే వారు''

అని భర్త దానగుణాన్ని రెండు ముక్కల్లో చెప్పింది లక్ష్మి.

''అలాంటిదేనమ్మా! మేమూ చేసి వస్తున్నాం''

లక్ష్మికి అర్థంగాలేదు.

''నువ్విచ్చిన నాన్నగారి డ్రెస్సులన్నీ 'స్వీకార్- ఉపకార్' సంస్థకి అందజేశాం. అక్కడుండే వికలాంగులకి చలికాలంలో ఈ బట్టలెంతగానో ఉపయోగపడతాయనే సదుద్దేశంతో నీతో చెప్పకుండా ఇచ్చొచ్చాం. నీతో ఓ మాట చెప్పెళ్దామంటే- మంచి పని చేసి అత్తయ్యగారికి చెబుదాం, ఆమె సంతోషిస్తారు అంది సుమిత్ర'' అని తాము చేసిన ఘనకార్యాన్ని తల్లికి వినిపించాడు రమేష్.

లక్ష్మి మౌనంగా ఎదురుగా నిలబడ్డ కొడుకుల్ని పై నుండి కిందికి చూసి, చిర్నవ్వుతో పంపింది.

★ ★ ★

''హమ్మయ్య! అన్నయ్యా! మనం చేసొచ్చిన పనికి అమ్మ తన సంతోషాన్ని చిర్నవ్వుతో వ్యక్తం చేసింది. ఇహపై స్థలం, ఇల్లు మనకి రావడానికి ఏ అడ్డంకీ ఉండదు. వీలు చూసుకుని అమ్మకి చెప్పేద్దాం'' అన్నాడు సురేష్.

మర్నాడు ఉదయం..

నలుగురూ నిద్రలేచి కాఫీ తాగుతుంటే, కింద లక్ష్మి ఎవరితోనో మాట్లాడుతుండటం వినిపించి, గీత కిందికి చూసింది. తెలిసిన వాళ్ళెవరూ కనిపిం

ఎం. ంకటేశ్వరరావు

చలేదు.

ఇంతలో పనిమనిషి పైకొచ్చి ''అమ్మగారు మిమ్మల్నందర్నీ కిందకి రమ్మన్నారండి'' అంది.

నలుగురూ కిందికి దిగారు.

లక్ష్మి అక్కడున్న వాళ్ళకి, ''వీడు నా పెద్దకొడుకు రమేష్. యు.ఎస్.లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈమె నా పెద్దకోడలు సుమిత్ర, వాడు రెండో వాడు సురేష్. వీడూ యూ.ఎస్.లోనే జాబ్ చేస్తున్నాడు. ఆమె గీత చిన్నకోడలు'' అని వాళ్ళని పరిచయం చేసి,

కొడుకుల వైపు తిరిగి- ''ఈయన విద్యాసాగర్రావుగారు మన వకీలు'' అని మిగిలిన వాళ్ళని పరిచయం చేసింది.

అడ్వకేటు ఆగమనం ఆస్తి పంపకాలకే అనుకుని వంశోద్ధారకుల మొహాల్లో మందహాసం.

''అత్తగారి మెళ్ళో గొలుసూ, వజ్రపు కమ్మలు, ముక్కుపుడక కనిపించటం లేదేం? ఏం చేసిందబ్బా!'' కోడళ్ళ గుసగుసలు.

విద్యాసాగర్రావు నలుగురినీ చూస్తూ...'మీ నాన్నగారు చాలా కాలం నుండి నాకు తెలుసు. మీ అమ్మగారు మీ గురించి చాలా ఉన్నతంగా చెప్పారు. మిమ్మల్ని చూస్తుంటే, ఆమె చెప్పిన మాటలు అక్షరాలా నిజం అనిపిస్తోంది. చాలా సంతోషం'' అన్నాడు.

''రావుగారూ! నా కొడుకులు ఎంత బుద్ధిమంతులో, కోడళ్ళు అంత గుణవంతులు. మావారి మరణం నాలో శూన్యతని, దుఃఖాన్ని నింపేశాయి. నేనేం చేయాలో ఆలోచించనీయనంతగా ఆయన ప్రభావం నా మీద ఉంది. సరిగ్గా ఆ సమయంలోనే నా కొడుకులు మీ నాన్నగారి ఆశయాల్ని, ధర్మగుణాల్ని వారసత్వంగా స్వీకరించి, తమకంటే తక్కువ స్థాయిలో ఉన్నవారి పట్ల ప్రదర్శించిన కరుణ, ఆదరణ నన్నెంతగానో కదిలించి, నా కర్తవ్యం ఏమిటో గుర్తుచేశాయి. వీళ్ళు చేసిన చిన్న పని, నేను చేయాల్సిన పెద్దపనికి ప్రేరణనిచ్చింది.''

లక్ష్మి మాటలు వింటున్న కొడుకులూ, కోడళ్ళూ ఆమె చెప్పబోయే మాటల కోసం ఉవ్విళ్ళూరసాగారు.

విద్యాసాగర్రావు ఫైలులోని పేపర్లు తీసి ''చదవమంటారా?'' అన్నాడు.

''ఉండండి. నేనే చెబుతాను. బాబూ రమేష్, సురేష్. మీ నాన్నగారు మన మధ్య లేరన్న బాధ తప్ప ఆయన మనకెటువంటి ఏ లోటూ చెయ్యలేదు. మీరిద్దరూ మొన్న అనాథాశ్రమాల గురించీ, వికలాంగుల శరణాలయాల గురించీ చెబుతుంటే ఏమోలే అనుకున్నాను. కానీ మీవి ఒట్టిమాటలు కావని, చేతల్లో నిరూపించడం నాలో మార్పుకి నాంది వేశాయి. నేనూ మీరందరూ సంతోషపడే శుభవార్త చెప్పబోతున్నాను.

మాదాపూర్ దగ్గర్లో ఉన్న మన ఐదెకరాల స్థలాన్ని వికలాంగులైన అనాథల కోసం తయారవుతున్న ఓ శరణాలయానికి ఇచ్చేశాను. బంజారాహిల్స్‌లో ఉన్న ఇంటితోబాటు, నా దగ్గరున్న నగలన్నీ అమ్మి వచ్చిన డబ్బుతో మీ నాన్నగారి పేరుతో ఓ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి, పదిమందికి ఉపయోగపడే 'ఉచిత బ్లడ్ బాంకు' పెట్టాలని నిర్ణయించుకుని అన్ని ఏర్పాట్లూ చేశాను. ఈయన రామచంద్రంగారు, శరణాలయపు ఏర్పాట్లు చూస్తున్నారు. ఈయన డా.శివశంకర్‌గారు బ్లడ్ బాంకు పన్లు చూస్తున్నారు'' అంది.


నలుగురి మొహాల్లో... నెత్తురు చుక్క లేనట్టు వాడిపోయాయి.

సుమిత్ర ఏదో చెప్పబోతుంటే...అడ్డొచ్చి,

''ఈ విషయం మీకు ముందే చెబుదామనుకున్నాను. కానీ మంచి పనులకి మీ నలుగురూ నాలుగు స్తంభాల్లా నాతో నిలబడతారన్న నమ్మకంతో పూర్తి చేసి చెబుతున్నాను. నేనుండబోయే ఈ ఇల్లు నా తదనంతరం మంచి లైబ్రరీగా మారాలన్నది నా కోరిక. విదేశాల్లో ఉండే మీకెలాగూ ఈ ఆస్తులపై ఆ బాధ్యత, ఆసక్తి ఉండదు. 'ఛారిటబుల్ ట్రస్ట్' నిర్వర్తిస్తుంది. నాలో ధర్మ చింతనకి పెట్టుబడి మీ నాన్నగారిదైతే, కార్యాచరణకి కారకులు మీరయ్యారు. నేనూ మీ బాటనే అనుసరించాలనే ఈ నిర్ణయాలు తీసుకున్నాను. నేను పేపర్ల మీద సంతకాలు పెట్టాను. మీరూ వచ్చి సంతకాలు చెయ్యండి. రండి!'' అంది లక్ష్మి.

నలుగు షాక్ నుండి తేరుకునే లోపల విద్యాసాగర్రావు పేపర్లన్నీ అందించడంతో మౌనంగా సంతకాలు చేస్తుంటే, కోడళ్ళిద్దరూ విసవిసా పైకెళ్ళిపోయారు.

❀



## స్వీట్‌గర్ల్

**'అమీషాపటేల్ స్వీట్‌గర్ల్' అని స్టేట్‌మెంట్ ఇస్తున్నాడో నటుడు. ఇంతకీ ఆ నటుడెవరని కుతూహలంగా ఉందా? అయితే వినండి. బిగ్‌బీ తనయుడు అభిషేక్ అమీషా పటేల్ గురించి అన్నమాటలివి. 'నేనూ అమీషా బోస్టన్‌లో కలిసి చదువుకున్నాం. ఆమె స్వీట్‌గర్ల్. నాకు మంచి ఫ్రెండ్. అయితే ఆమెతో డేటింగ్ ఉందని ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఎవరో పనిగట్టుకుని కల్పించిన కట్టుకథ' అని స్టేట్‌మెంట్లు ఇస్తున్నాడు. 'నేనిప్పుడు అయిదు సినిమాల్లో నటిస్తున్నాను. రాంగోపాల్‌వర్మ 'నాచ్', రేవతి చిత్రం, 'రాజ్‌కుమార్ సంతోషి చిత్రం 'రన్వీర్', 'బోనీ కపూర్' రన్ చిత్రాల్లో నటిస్తున్నాను' అంటున్నాడు అభిషేక్. ఈ ఇద్దరికీ మధ్య ఏం ఉందో ఎవరికి తెలుసు?**